
సాక్షి నంద్యాల

శనివారం । 3 । ఆగస్టు । 2024



గోరుకల్లులో 4 టీఎంసీలు

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ శుభకుమార్ తెలిపారు. ఇన్‌ఫ్లో 8వేల క్యూసెక్కులు వస్తుండగా బైపాస్‌కు 1,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.



.. ఉనికిపాటు వైరం!

టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరింది. ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మధ్య అసమ్మతి జ్వాల రగులుతూనే ఉంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.30
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:99.038
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,90,885
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,82,126

న్యూస్‌రీల్

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: జిల్లాలో పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఎస్పీ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీలు, మెడికల్ తదితర అంశాలను తమ దృష్టికి తెచ్చారని, త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమని కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐలు జయరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛన్ మొత్తంతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్

నంద్యాల: పింఛన్ సొమ్ముతో పరారైన ప్యాపిలి మండలం వెంగళంపల్లి సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పథకం కింద 50 మంది పెన్షన్ దారులకు పంపిణీ చేయాల్సిన రూ. 2,23,500తో పరారైన సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. సంబంధిత మొత్తాన్ని తల్లిదండ్రులను పిలిపించి వసూళ్లు చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు రిమాండ్‌కు తరలించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతారహితంగా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

2,775 మందికి అందని పింఛన్లు

- రెండో రోజు సచివాలయాల్లో పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆగస్టు నెల 2,775 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందలేదు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కూడా సచివాలయాల్లోనే కొనసాగింది. పింఛన్ల పంపిణీ రెండు రోజులకే పరిమితం కావడంతో వివిధ అవసరాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లిన వారు హడావుడిగా గ్రామాలకు చేరుకున్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తారని ఎదురు చూశారు. వారు రాకపోవడంతో సచివాలయాలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 2,43,337 పింఛన్లు ఉండగా 2,41,931 పంపిణీ చేశారు. మొత్తం 1,406 మందికి పింఛన్లు పంపిణీ చేయలేదు. నంద్యాల జిల్లాలో 2,19,863 పింఛన్లు ఉండగా 2,18,494 పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 1,369 మంది పింఛన్లు పొందలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లాకు రాష్ట్రంలోనే మొదటి స్థానం, నంద్యాల జిల్లాకు 3వ స్థానం లభించింది. కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడంతో డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాషా సంతృప్తి వ్యక్తం చేశారు.

డోన్ గురుకుల పాఠశాలల్లో విచారణ



అధికారిణి శ్రీదేవికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: గత కొన్ని రోజులుగా డోన్ అంబేడ్కర్ గురుకుల బాలికల, బాలుర పాఠశాలల్లో జరుగుతున్న ఘటనలపై ఏపీఎస్‌డబ్ల్యూర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యార్థులతో భోజనం వడ్డిస్తున్నారని ఆరోపణలు రావడం, కొద్ది రోజుల క్రితం బాలికల పాఠశాల సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం వంటి ఘటనలపై విద్యార్థులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే రెండు పాఠశాలల ప్రిన్సిపాళ్లు వేణుగోపాల్, గీతా హాజరుకాకపోవడంతో విచారణ తూతూమంత్రమేనని పలు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఆల్ ఇండియా బంజార సంఘ్ జిల్లా అధ్యక్షులు కృష్ణనాయక్, ఎంఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయభాస్కర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, సీపీఐ డోన్, ప్యాపిలి మండల అధ్యక్షులు నారాయణ, వెంకటేశ్వర్లు, నాయకులతో పాటు దళిత సంఘం నేతలు ఆమెను కలిసి పక్కడ్బందీగా విచారణ చేపట్టాలని కోరారు. స్కూళ్లలో ప్రవేశాల్లో అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సస్పెండ్ చేయాలన్నారు.

ఆత్మలు ఘోషిస్తున్నాయి.. ఆస్తులు ఏడుస్తున్నాయి

దబ్బూ.. దబ్బూ.. నీవు ఏమి చేస్తావంటే అన్నదమ్ములను విడగొడతా.. రక్త సంబంధాలను తెంపేస్తా అని అంటుంది. ఆస్తులపై ఆశ చూపిస్తూ అయిన వారిని దూరం చేస్తుంది. ఈ విషాద ఘటన చూస్తే నిజమే అనిపిస్తోంది. ఓ కుటుంబంలో ఏర్పడిన ఆస్తి కలహాలు చివరకు నలుగురి మృతికి కారణమైంది. రూ. కోట్ల ఆస్తితో పాటు సొంత ఇల్లు ఉన్నా విభేదాలతో అదే ఊరిలో పాత ఇంటిలో ఉన్న అతడితో పాటు భార్య, ఇద్దరు పిల్లల ప్రాణాలు అర్ధరాత్రి గాలిలో కలిశాయి. మట్టి శిథిలాల కింద నలుగురు సజీవ సమాధి కాగా.. ఆప్తులను పోగొట్టుకున్న వారు వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

- ఆస్తి పంపకాల విభేదాలతో వేర్వేరుగా ఉంటున్న తల్లి, కుమారుడు
- రూ. 2 కోట్ల ఆస్తి ఉన్నా అద్దెకు పాత ఇంట్లో భార్యా పిల్లలతో నివాసం
- మట్టిమిద్దె కూలి నలుగురు సజీవ సమాధి
- హాస్టల్‌కు వెళ్లి ప్రమాదం నుంచి బయటపడిన రెండో కుమార్తె



కూలిన మట్టి మిద్దె

చాగలమర్రి: ఇద్దరు బిడ్డలతో కలసి రాత్రి ఆ దంపతులు భోజనం చేసి నిద్రించారు. వారికి అదే చివరి భోజనమని, అదే చివరి రాత్రి అని ఊహించలేదు. తెల్లారేసరికి నలుగురి ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. పాత మిద్దె కూలి నలుగురు సజీవ సమాధి అయ్యారు. ఈ విషాద ఘటన చిన్నవంగలి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి (45), భార్య దస్తగిరమ్మ (40), పెద్ద కుమార్తె పవిత్ర (19), మూడవ కుమార్తె గురులక్ష్మి(9) దుర్మరణం చెందారు. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నవంగలి గ్రామానికి చెందిన గుర్విరెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులకు కుమారుడు గురుశేఖర్‌రెడ్డి, కుమార్తెలు గురుదేవి, అమ్మణ్ణి ఉన్నారు. గురుశేఖర్‌రెడ్డికి 25 ఏళ్ల క్రితం వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం మూడెళ్లపల్లె గ్రామానికి చెందిన దస్తగిరమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె పవిత్ర ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. రెండవ కుమార్తె ప్రసన్న వైఎస్సార్ జిలా ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ పాఠశాలలో హాస్టల్‌లో, మూడవ కుమార్తె గురులక్ష్మి స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. గురుశేఖర్‌రెడ్డికి పిత్రార్జితంగా ఇల్లు, కొంత స్థలం, ఆరు ఎకరాల పొలం ఉంది. వాటి విలువ దాదాపు రూ. 2 కోట్లు ఉంటుంది. అయితే పదేళ్ల క్రితం గురుశేఖర్‌రెడ్డి తండ్రి గుర్విరెడ్డి మృతి చెందడం, ఆ తర్వాత తల్లి రామలక్ష్మమ్మతో ఆస్తి విభేదాలు రావడంతో అతను భార్యాపిల్లలతో సొంత ఇంటిని వీడారు. అదే ఊరిలో ఓ పాత ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వ్యవసాయ పనులకు వెళ్తా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ పాత ఇల్లే ఆ కుటుంబానికి శాపంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బాగా తడిచి గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్ప కూలింది. స్థానికులు శిథిలాలను తొలగించి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే వారు శిథిలాల కింద ప్రాణాలు విడిచారు. సంఘటన స్థలంలో బంధువులు, కుటుంబీకులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, ఎంపీడీఓ సుర్యనారాయరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను, కూలిన మట్టి మిద్దెను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ అల్లుడికి ఆస్తి ఇవ్వకపోగా ఇంటి నుంచి గెంటేశారని, పేదరికం కారణంగా పాడుబడిన ఇంట్లో ఉంటూ తనతోపాటు కుటుంబాన్ని బలి తీసుకున్నాడని అతని అత్తమామలు ఉశేన్‌రెడ్డి, రామసుబ్బమ్మ రోదిస్తున్నారు. ఇప్పటికైనా ఆస్తిని బతికి ఉన్న తన మనువరాలు ప్రసన్నకు ఇప్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు.



గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ మృతదేహాలు



మృతులు పవిత్ర, గురులక్ష్మి

సాయంత్రమే హాస్టల్‌కు వెళ్లి.. ప్రాణాలతో బయటపడి



విషాద ఘటనలో గురుశేఖర్‌రెడ్డి రెండో కుమార్తె ప్రసన్న త్రుటిలో ప్రాణాలతో బయటపడింది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. రెండు రోజుల క్రితం గ్రామానికి చేరుకుంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం తిరిగి హాస్టల్‌కు చేరుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడింది. తెల్లారేసరికే కుటుంబ సభ్యులందరూ మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ప్రసన్న కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. శుక్రవారం ఉదయాన్నే వెళ్తానన్నా తల్లి వినలేదని, పట్టుబట్టి గురువారం సాయంత్రం ఆటోలో ప్రొద్దుటూరుకు పంపించి తనను కాపాడిందని.. గుర్తు చేసుకుని రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

గ్రామంలో విషాదఛాయలు

ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో చిన్నవంగలి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు ఇరుగు పొరుగు వారితో కలిసి కూర్చుని మాట్లాడిన కుటుంబం తెల్లారే సరికే మృతి చెందడంతో స్థానికులు తట్టుకోలేక పోతున్నారు. ప్రమాద స్థలానికి చేరుకున్న గ్రామస్తులు నలుగురి మృతదేహాలను చూసి చలించిపోయారు. మృతులతో ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య

పుట్టింటి బియ్యం తినకుండానే..

పేదరికం కారణంగా దస్తగిరమ్మ పుట్టింటి నుంచి బియ్యం తెచ్చుకునేందుకు గురువారం ఉదయాన్నే చిన్న కుమార్తె గురులక్ష్మితో కలసి వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం మూడిళ్లపల్లె గ్రామానికి వెళ్లింది. అక్కడ మధ్యాహ్న భోజనం చేసి బియ్యం తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే అప్పటికే ఆకాశంలో మబ్బులు కమ్మడంతో వర్షం పడేటట్టు ఉంది.. రేపు వెళ్దువులే అని దస్తగిరమ్మను తల్లిదండ్రులు రామసుబ్బమ్మ, ఉసేన్‌రెడ్డి ఆపే ప్రయత్నం చేశారు. అయినా ఆమె వినలేదు. తన కుమార్తె ప్రసన్నను హాస్టల్‌కు పంపించాలని చెప్పి చిన్నవంగలికి చేరుకుంది. ఆ విషయాన్ని గుర్తు చేసుకుని ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



మృతురాలు దస్తగిరమ్మ తల్లిదండ్రులు

స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లపై పునఃసమీక్షించాలి

- ఫోరం నిర్ణయాలను వెల్లడించిన ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయానికి మినహా ఇతర అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని పునఃసమీక్ష చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని సదరన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ ఫోరం నిర్ణయించింది. శుక్రవారం కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీఈఆర్‌సీ) కార్యాలయంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన సదరన్ ఎలక్ట్రిసిటీ ఫోరం 22వ సదస్సు నిర్వహించారు. సదస్సులో ఐదు రాష్ట్రాల్లోని విద్యుత్ రంగంలో ఉత్పన్నమవుతున్న సమస్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 2025 జనవరి చివరి నాటికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, వీటి ఏర్పాటుతో 100 యూనిట్ల వినియోగం ఉన్న వినియోగదారులపై భారం పడుతుందని ఐదు రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించే విధంగా కేంద్రాన్ని కోరుతూ మెమొరాండం ఇవ్వాలని నిర్ణయించినట్లు ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తెలిపారు. మీటర్ల ఏర్పాటుతో కలిగే పరిణామాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు డిస్కంలకు నియమించిన స్పెషల్ ఆఫీసర్లు ఇచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామని, దీంతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్లు మరింత లోతుకు వెళ్లి విద్యుత్ విధానాన్ని, సమస్యలను విశ్లేషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫోరంలోని సభ్యులైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్లు, సభ్యులు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో వారిని ఘనంగా సత్కరించారు. సదస్సులో ఆయా రాష్ట్రాల చైర్మన్లు, సెక్రటరీలు, డిస్కం ఎండీలు పాల్గొన్నారు.


మల్లన్న హుండీ ఆదాయం రూ.3.31కోట్లు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.3,31,70,665 రాబడిగా లభించినట్లు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం దేవస్థాన పరిధిలోని చంద్రావతి కల్యాణ మండపంలో గత 29రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు బంగారం 127గ్రాములు, వెండి 4కేజీల 400గ్రాములతో పాటు విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు ఈఓ తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీ కెమెరాల నిఘాతో హుండీ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

హంద్రీనీవాకు 675 క్యూసెక్కులు విడుదల



మల్యాల వద్ద నీటిని విడుదల చేసిన దృశ్యం



గార్గేయపురం వద్ద నీటి ప్రవాహం ఇలా..

నందికొట్కూరు: మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా కాలువకు శుక్రవారం 675 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నీటి విడుదలలో జాప్యమైంది. గార్గేయపురం సమీపంలో హంద్రీనీవా కాల్వపై తాత్కాలిక రహదారి అసంపూర్తిగా వేయడంతో నీటి ప్రవాహం తగ్గే అవకాశం ఉంది. వారం రోజుల ముందే నీటి విడుదల చేసి వుంటే పంటలు పూర్తిగా బతికేవని బ్రాహ్మణకొట్కూరు, గార్గేయపురం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వాపోతున్నారు. హంద్రీనీవా కాలువపై ఆధారపడి వేసిన మొక్కజొన్న, ఉల్లి పంటలు ఇప్పటికే వాడుపట్టాయి. వరుణుడు మొఖం చాటేయడంతో మొక్కజొన్న పంట 50 శాతం వాడుపట్టిందని రైతులు సీతారామిరెడ్డి, గౌస్‌మియ్యా ఆవేదన వ్యక్తం చేశారు.

నిప్పులవాగుకు 1,050 క్యూసెక్కులు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,050 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి 1,67,728 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా ఆ నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. డ్యాంనుంచి కేసీ కాల్వకు 2,800 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీరు లాకిన్స్‌లా వరకు 1,800 క్యూసెక్కులు చేరుతుండగా అందులో 1,050 క్యూసెక్కులు నిప్పులవాగుకు, 650 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు, ఏబీఆర్ కాల్వకు 50క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గానికో డీఎస్పీ

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 8 సబ్ డివిజన్లు

- సబ్ డివిజన్‌లుగా మారనున్న మరో 6 నియోజకవర్గాలు
- సబ్‌డివిజన్‌లపై కసరత్తు చేస్తోన్న 'త్రిసభ్య' కమిటీ
- పోలీసుశాఖలో మిశ్రమ స్పందన
- డీఎస్పీల స్థాయి తగ్గుతుందనే అభిప్రాయం

టీడీపీ ప్రభుత్వం పోలీసు సబ్ డివిజన్లు పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో ఒక సబ్ డివిజన్ ఏర్పాటు చేసి, డీఎస్పీలను నియమించనుంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం కర్నూలులో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్లు.. అలాగే నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో అదనంగా ఆరు సబ్ డివిజన్లు ఏర్పాటు కానుండగా.. అదనంగా ఆరు డీఎస్పీ పోస్టులకు అవకాశం ఏర్పడనుంది.



సాక్షి ప్రతినిధి కర్నూలు: ప్రస్తుతం పోలీసుశాఖ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కొందరి కనుసన్నల్లో నడుస్తోంది. ఎస్పీలు, డీఎస్పీలు, సీఐల పోస్టింగులు కూడా మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల్లో లేకుండా ప్రభుత్వం నియమించిన 'త్రిసభ్య కమిటీ' చేతుల్లోకి వెళ్లింది. ఎవరు ఏ పోస్టుకు సిఫార్సు చేసినా చివరగా కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే డీవో, జీవో బయటకు వచ్చే పరిస్థితి. ఇప్పుడు జరుగుతున్న బదిలీలు 'కమిటీ' కనుసన్నల్లోనే జరుగుతున్నాయనేది పోలీసుశాఖలో అందరికీ తెలిసిన సత్యం. ఈ క్రమంలో 'త్రిసభ్య కమిటీ' ప్రభుత్వం ముందు మరో ప్రతిపాదన ఉంచినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొన్ని చోట్ల ఒక సబ్ డివిజన్ పరిధిలో రెండు, మూడు నియోజకవర్గాలు వస్తున్నాయి. మరికొన్ని నియోజకవర్గాలలో ఒక అసెంబ్లీలోని కొన్ని మండలాలు ఒక సబ్ డివిజన్‌లో, మరికొన్ని మండలాలు మరో సబ్ డివిజన్‌లో ఉన్నాయి. దీంతో పాలన, విధానపరమైన నిర్ణయాలతో పాటు ఏ ఘటన జరిగినా ఒక ఎమ్మెల్యే ఇద్దరు, ముగ్గురు డీఎస్పీలతో మాట్లాడాల్సి వస్తోంది. అలాగే ఒక డీఎస్పీ కూడా ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలతో చర్చించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. మొన్నటి డీఎస్పీల పోస్టింగుల కోసం కూడా సబ్ డివిజన్‌లలో ఒక ఎమ్మెల్యే ఒక పేరు, మరో ఎమ్మెల్యే ఇంకో పేరు ఇచ్చి ప్రభుత్వం, త్రిసభ్య కమిటీపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. డీఎస్పీల బదిలీల జాబితా పరిశీలిస్తే.. పోస్టింగ్‌లు లేకుండా ఖాళీగా ఉన్న డీఎస్పీల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నట్లు కమిటీ గుర్తించింది. మొన్నటి డీఎస్పీల బదిలీల్లోనే ఏకంగా 57మందికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ క్రమంలో నియోజకవర్గానికి ఓ సబ్ డివిజన్ ఏర్పాటు చేసి, డీఎస్పీలను నియమిస్తే ఒక ఎమ్మెల్యే పరిధిలో ఒక డీఎస్పీ ఉంటారు. పాలనలో ఎలాంటి వివాదాలు ఉండవని కమిటీ సూచించినట్లు తెలుస్తోంది. దీనికి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో ఒక కమిటీ వేసి నివేదిక తెప్పించుకుని సబ్ డివిజన్‌లు ఏర్పాటు చేయాలనే భావనలో ఉన్నట్లు సమాచారం.

పోలీసుశాఖలో మిశ్రమ స్పందన

- ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న కొత్త నిర్ణయంపై పోలీసుశాఖలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.
- ఎస్పీ తర్వాత అత్యంత ప్రాధాన్యత పోస్టు డీఎస్పీ అని, నియోజకవర్గానికి ఓ డీఎస్పీని నియమిస్తే ఆ పోస్టు స్థాయిని తగ్గించడమే అని కొందరు చర్చించుకుంటున్నారు.
- కొన్ని నియోజకవర్గాల్లో ఒకరు, ఇద్దరు సీఐలు మాత్రమే ఉంటారని, వారిపై డీఎస్పీ ఉంటే నియోజకవర్గానికి మరో సీఐలా ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- ఇంకొందరు చాలామంది డీఎస్పీలు పోస్టింగులు లేక ఖాళీగా ఉన్నారని, సబ్ డివిజన్లు పెరిగితే అందరికీ పోస్టులు దక్కుతాయని సంతోషపడుతున్నారు.
- పైగా త్వరలో రాష్ట్రంలోని సీఐలు డీఎస్పీలుగా పదోన్నతులు పొందనున్నారని, డీఎస్పీల సంఖ్య పెరిగితే పోస్టులు లేనప్పుడు వారంతా ఎక్కడ విధులు నిర్వహించాలనే చర్చ జరుగుతోంది.
- అందువల్ల సబ్ డివిజన్‌లు పెరిగితే డీఎస్పీలకు ఏదో ఒక సబ్‌డివిజన్‌లో పోస్టు దక్కుతుందని భావిస్తున్నారు.

ప్రభుత్వ అసలు ఉద్దేశం ఇదేనా?:

టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికార పార్టీ నేతలపై ఏ స్థాయి అరాచకాలు జరుగుతున్నాయో తెలిసిందే! హత్యలు, దాడులు.. ఆస్తులు, విగ్రహాల విధ్వంసాలు సాధారణమయ్యాయి. కనీసం వీటిని నివారించేందుకు కూడా పోలీసుశాఖ ప్రయత్నం చేయలేదు. దీనికి కారణం పోలీసుశాఖను అధికార పార్టీ పూర్తిగా తమ గుప్పిట్లో పెట్టుకుని తాము చెప్పినట్లే 'లా అండ్ ఆర్డర్' నడిపేలా వ్యవహరిస్తోంది. రానున్న ఐదేళ్లు ఇటు అధికారపార్టీకి, విపక్షపార్టీకి అత్యంత కీలకమైంది. రెండేళ్లలో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. 'సూపర్ సిక్స్' అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు లోకేశ్, పలువురు మంత్రులు చెప్పకనే చెబుతున్నారు. 'సూపర్ సిక్స్'కే దిక్కు లేకపోతే మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయడం అధికారపార్టీకి అసాధ్యమైన పని. పథకాలు అమలు చేయకపోతే ప్రజల్లో, రాజకీయపార్టీల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ప్రజావ్యతిరేకతపై ప్రధాన ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలు ఆందోళనలు చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో తమకు అనుకూలంగా ఉన్న అధికారులను నియమించుకుని నియోజకవర్గాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకోవాలనే భావనలో 'టీడీపీ ప్రభుత్వం' ఉన్నట్లు తెలుస్తోంది. విపక్ష పార్టీల నేతలు ఎక్కడైనా చురుగ్గా ఉన్నా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పినా, ఆందోళనలు చేసినా అణచివేయొచ్చనే భావన కనిపిస్తోంది. ఈ క్రమంలోనే కొత్త సబ్ డివిజన్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం కాబోతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఓట్లు వేయలేదని.. నీటి సరఫరా నిలిపివేత



పెసరవాయిలోకి బీసీ కాలనీలో మోటారు పెట్టెకు తాళం వేసిన దృశ్యం

గడివేముల: తమ పార్టీకి ఓట్లు వేయలేదనే నెపంతో బీసీ కాలనీకి మంచినీటి సరఫరా నిలిపివేసి టీడీపీ నాయకులు తమ ప్రతాపాన్ని చూపారు. ఈ ఘటన పెసరవాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని బోధనం రస్తాలో బీసీ కాలనీలో 40 కుటుంబాలు ఉన్నాయి. వారికి గత 20 రోజుల నుంచి మంచి నీరు సరఫరా చేయకుండా టీడీపీ నాయకులు మోటారు పెట్టెకు తాళం వేశారు. ఎంపీడీఓ శివ రామిరెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బడిలో పని పాఠం



పాఠశాల గేటుకు పెయింట్ వేస్తున్న విద్యార్థులు

అవుకు: తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకోవడానికి బడికి పంపిస్తే అక్కడి ఉపాధ్యాయులు పిల్లలతో పనులు చేయిస్తున్నారు. అవుకు ముస్లిం వీధిలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నూతన గేటును నిర్మించారు. ఆ గేటుకు పెయింట్ వేస్తూ విద్యార్థులు కనిపించారు. దాదాపు ఏడెనిమిది అడుగుల ఎత్తులో గేటుకు రంగులు వేస్తుండటంతో స్థానికులు పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత ఎత్తులో నుంచి కింద పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

52 మంది సీఐల బదిలీ

కర్నూలు అగ్రికల్చర్: పోలీసు శాఖ కర్నూలు రేంజ్ పరిధిలో 52 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బదిలీలు జరగడం గమనార్హం.

గోడకు కన్నం వేసి.. మొబైల్ దుకాణంలో చోరీ



మొబైల్ దుకాణానికి కన్నం వేసిన దృశ్యం

కర్నూలు: నగరంలోని కల్లూరు చౌడేశ్వరి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రియా మ్యూజికల్స్ అండ్ మొబైల్ సర్వీస్ పాయింట్‌లో చోరీ జరిగింది. దుకాణం వెనుక భాగంలో గోడకు కన్నం వేసి దొంగలు లోపలికి ప్రవేశించి రూ.10 లక్షలు విలువ చేసే మొబైల్ ఫోన్లు మూటగట్టుకుని ఉడాయించారు. 31వ తేదీ రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణం యజమాని కార్తీక్ తాళం వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం దుకాణం వెనుక గోడకు కన్నం కనిపించడంతో పక్కదుకాణం వారు కనుగొని సమాచారం ఇవ్వడంతో కార్తీక్ అక్కడకు వచ్చి చూడగా సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను కట్ చేసి బ్యాకప్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్, డీవీఆర్‌తో పాటు రిజిస్టర్లు, సేల్స్‌కు సంబంధించిన బిల్స్‌ను మూటగట్టుకుని ఉడాయించారు. దుకాణానికి కొద్ది దూరంలో రిజిస్టర్, బిల్స్‌ను తగలబెట్టి వెళ్లిపోయారు. దుకాణం యజమాని కార్తీక్ శుక్రవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు.

కండువాలేని పెత్తనం.. ఉనికిపాటు వైరం!

చిచ్చురేపిన నందికొట్కూరు రూరల్ సీఐ బదిలీ

- బైరెడ్డి సిఫారసుకే తలొగ్గిన టీడీపీ అధిష్టానం
- గత 50 రోజులుగా ఆయనకే ప్రాధాన్యం
- తమ సిఫార్సును పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే సూర్య, మాండ్ర కినుక
- పార్టీ తేలిగ్గా తీసుకోవడంపై డైలమాలో ఇద్దరు నేతలు
- ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయం



టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరింది. ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మధ్య అసమ్మతి జ్వాల రగులుతూనే ఉంది. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై జిల్లా అధ్యక్షుడు, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా బైరెడ్డి తీరు మారలేదనే కారణంతో తాడోపేడో తేల్చుకునేందుకు జయసూర్య సిద్ధమయ్యారు. పార్టీలో తన ప్రాధాన్యత ఏంటో తేలేదాకా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోని కార్యక్రమాలన్నీ రద్దు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: నందికొట్కూరు తెలుగుదేశం పార్టీలో ఓ వర్గానికి బైరెడ్డి రాజశేఖరరెడ్డి నాయకత్వం వహిస్తుంటే.. ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డిలు మరో వర్గం. బైరెడ్డి, గౌరు కుటుంబాలకు సుదీర్ఘ రాజకీయ వైరం ఉంది. అనివార్య కారణాలతో రెండు కుటుంబాలు కలిసి సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నాయి. అయితే రెండు మూడు దశాబ్దాలుగా ఉన్న రాజకీయవైరం మాత్రం వారి మనస్సులోనే అలాగే ఉంది. దీంతో రెండు వర్గాలు నందికొట్కూరును గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ఎవరికి వారు ఆధిపత్యాన్ని చెలాయించాలని చూస్తున్నారు. దశాబ్దకాలంగా నందికొట్కూరు రాజకీయం పూర్తిగా గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తోంది. నియోజకవర్గానికి బైరెడ్డి దాదాపుగా దూరమయ్యారు. ఈ క్రమంలో కుమార్తె శబరిని ఎంపీగా గెలిపించుకోవడంతో.. తిరిగి నందికొట్కూరు రాజకీయాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకునేలా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే తాను బీజేపీకి రాజీనామా చేయకుండా, టీడీపీలో చేరకపోయినా విపక్ష పార్టీ నేతలకు 'పచ్చకండువా'లు వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్నారు. దీన్ని ఎమ్మెల్యే, మాండ్ర వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయంపై నేరుగా బైరెడ్డిపై ఎమ్మెల్యే విమర్శలు కూడా గుప్పించారు. అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది.

చిచ్చు రేపిన సీఐ సుధాకర్‌రెడ్డి పోస్టింగ్

ఎమ్మెల్యే, మాండ్ర శివానందరెడ్డి సిఫార్సు మేరకు నందికొట్కూరు రూరల్ సీఐగా సుధాకర్‌రెడ్డికి పోస్టింగ్ దక్కింది. ఈ నెల 31న డీవో(డ్యూటీ ఆర్డర్)లు వచ్చాయి. అయితే సుధాకర్‌రెడ్డి వచ్చి బాధ్యతలు స్వీకరించక ముందే బైరెడ్డి తన ప్రాబల్యాన్ని ఉపయోగించి సుధాకర్‌రెడ్డి బదిలీ ఆపేసి, ఆ స్థానంలో కృష్ణయ్యకు డీవో ఇప్పించారని తెలుస్తోంది. ఈ అంశమే ఇప్పుడు రెండు వర్గాల మధ్య విభేదాలను తారస్థాయికి చేరేలా చేసింది. ఎమ్మెల్యేగా తాను సిఫార్సు చేసిన వ్యక్తిని కాదని, బైరెడ్డి చెబితే పోస్టింగ్ ఎలా ఇస్తారని ఎమ్మెల్యే, మాండ్ర ప్రశ్నిస్తున్నారు. తన కుమార్తె ఎంపీ అయినంత మాత్రాన జిల్లాలో తక్కిన సర్కిళ్లలో కూడా ఎమ్మెల్యేలను కాదని, బైరెడ్డి చెప్పిన వారికే పోస్టింగులు ఇవ్వడంతో ఈ అంశంపై తాడోపేడో తేల్చుకోవాలని సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకూడదని నిర్ణయం

నియోజకవర్గంలో బైరెడ్డి పెత్తనం ఆపేదాకా అధికారిక కార్యక్రమాలకు హాజరుకాకూడదని ఎమ్మెల్యే జయసూర్య నిర్ణయించుకున్నట్లు తెలిసింది. శుక్రవారం పగిడ్యాల మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావల్సి ఉంది. సీఐ బదిలీ వ్యవహారం తర్వాత సమావేశానికి ఎమ్మెల్యే గైర్హాజరయ్యారు. శుక్రవారం అధికారిక కార్యక్రమాలు పూర్తిగా రద్దు చేసుకున్నారు. తన సోషియల్ మీడియా గ్రూపుల్లో కూడా పగిడ్యాల సమావేశానికి ఎమ్మెల్యే హాజరు కావడం లేదని వెల్లడించారు. అధిష్టానం జోక్యం చేసుకుని నియోజకవర్గంలోని పంచాయతీ తెంచాలని.. లేదంటే ఈ అంశంలో ఎంత వరకైనా తగ్గేది లేదనే భావనలో ఎమ్మెల్యే, మాండ్ర ఉన్నట్లు తెలుస్తోంది. గత 50 రోజులుగా జరిగిన పరిణామాలు బేరీజు వేస్తే నందికొట్కూరులో బైరెడ్డికే టీడీపీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే, మాండ్ర మాటలు చెల్లుబాటు కావడం లేదని అక్కడి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారు. అయితే 'కూటమి' భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే మాటలు ఖాతరు చేస్తుందా? లేదా? అనేది తేలాలి. ఒక వేళ ఎమ్మెల్యే, మాండ్రను ఇలాగే తేలిగ్గా తీసుకుంటే ఈ వర్గం పయనం ఎటువైపోననే చర్చ కొనసాగుతోంది.

అంత్యక్రియలకు వెళ్తూ అనంత లోకాలకు

- బొలెరో వాహనం బోల్తా పడి ఒకరు మృతి
- ఆరుగురికి గాయాలు



మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి



బోల్తా పడిన బొలెరో వాహనం

ఆస్పరి: బంధువు అంత్యక్రియలకు వెళ్తూ బొలెరో వాహనం బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన చిన్న హోతూరు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కంప్లి దగ్గర ఉన్న మారెమ్మవ్వ క్యాంపులో బంధువుల్లో ఒకరు మృతి చెందడంతో నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన ఏడుగురు బొలేరో వాహనంలో శుక్రవారం బయలు దేరారు. ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామం దగ్గర వాహనం టైరు పంక్చరై బోల్తా పడింది. ప్రమాదంలో తాడి వెంకటేశ్వర రెడ్డి (65) అక్కడికక్కడే మృతి చెందారు. మేకల శివ నాగిరెడ్డి, ద్వారం కొండారెడ్డి, తాడి మహేశ్వరరెడ్డి, తాడి శివారెడ్డి, దారెడ్డి భూపాల్ రెడ్డి, తాడి రవీంద్రా రెడ్డి గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి 108లో గాయపడిన వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్‌పై వేటు

నందికొట్కూరు: పోలీసు అధికారుల పదోన్నతుల విషయంలో తప్పుడు నివేదిక ఇచ్చిన బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ నాగార్జున, ముచ్చుమర్రి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆరు నెలల క్రితం పదోన్నతుల్లో భాగంగా కొందరి అధికారుల నివేదికను జిల్లా పోలీసు శాఖ కోరింది. ఈ మేరకు ఎస్‌ఐ మారుతీ శంకర్‌పై ఎలాంటి కేసులు లేవని ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ నాగార్జున, హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ నివేదిక సమర్పించారు. దీంతో మారుతీ శంకర్ ఎస్‌ఐ నుంచి సీఐగా ప్రమోషన్ పొందారు. అయితే 2012లో పగిడ్యాల మండలం ఘణపురం గ్రామంలో తండ్రి, కొడుకుల మధ్య ఆస్తి వివాదంలో జరిగిన ఘర్షణ కేసులో తన మాట వినలేదని మారుతి శంకర్ గ్రామ ప్రజల సమక్షంలోనే ఫిర్యాదుదారులపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ మేరకు బాధితులు నందికొట్కూరు కోర్టును 2013లో ఆశ్రయించారు. 2015లో కోర్టు విచారణకు ఆదేశించడంతో అప్పటి ఎస్‌ఐ మారుతీ శంకర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ పూర్తి కాగా ఈ ఏడాది జూన్ 20న మారుతీ శంకర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించి కోర్టు సంచలన తీర్పు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కాగా మారుతీ శంకర్ పదోన్నతికి తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. కాగా నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ బాలిక హత్య కేసులో ఇప్పటికే సస్పెన్షన్ అయ్యారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ నాగార్జున, ముచ్చుమర్రి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గర్భిణికి అరుదైన ఆపరేషన్

- కిలోన్నర కణితి తొలగింపు
- తల్లీబిడ్డ క్షేమం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు గర్భిణికి శుక్రవారం అరుదైన ఆపరేషన్ చేశారు. పొట్టలో ఉన్న కిలోన్నర కణితి తొలగించడంతోపాటు బిడ్డను బయటకు తీశారు. తల్లీ బిడ్డ ప్రాణాలు కాపాడారు. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన కెసరం సరస్వతిని తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మునుగనూరు గ్రామానికి చెందిన కేసరం ఉదయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. సరస్వతి గర్భవతి కావటంతో పుట్టినిల్లు బైలుప్పలకు వచ్చింది. ఐదో నెలలో స్కానింగ్ చేసినప్పుడే డాక్టర్లు బిడ్డతో పాటు కణితిని గుర్తించారు. నెలలు నిండి శుక్రవారం నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు సరస్వతిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి గంట సేపు ఆపరేషన్ కిలోన్నర కణితిని తొలగించారు. అలాగే 3.2 కిలోల ఆడబిడ్డను సురక్షితంగా బయటకు తీశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, ఇలాంటి ఆపరేషన్ చేయటం ఇక్కడ ఇదే మొదటిసారని డాక్టర్ తెలిపారు. ఆపరేషన్‌లో మత్తు డాక్టర్ జీవిత, సిస్టర్లు జాహిదా, శోభరాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి



దాడిలో గాయపడిన పెద్దయ్య

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దయ్యపై తెలుగుదేశం నాయకుడు రంగస్వామి, అతని భార్య, కుమారుడు దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన ఆంజనేయులకు రంగస్వామి, పెద్దయ్య, మునిస్వామి కుమారులు. ముగ్గురు అన్నదమ్ములు పొలాలు పంచుకోగా తండ్రి కోసం ఒక ఎకరం పొలాన్ని తీసిపెట్టారు. రెండో కుమారుడు పెద్దయ్య దగ్గరే తండ్రి ఉంటూ రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఎకరం పొలం దగ్గర తండ్రి సమాధి కట్టించాలని పెద్దయ్య భావించగా సోదరుడు రంగస్వామి అడ్డుకున్నాడు. పెద్దయ్య వైఎస్సార్‌సీపీ నాయకుడుగా ఉండటంతో సోదరుడు రంగస్వామి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్ధలు పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం మోటారు సైకిల్‌పై పొలానికి నారు తీసుకెళ్తున్న పెద్దయ్యపై వంక వద్ద మాటు వేసి రంగస్వామి, అతని భార్య, కుమారుడు రాడ్లు, చెలిక, రాళ్లతో దాడికి దిగారు. పెద్దయ్య తేరుకునేలోపు మూకుమ్మడి దాడి చేయటంతో స్పృహ తప్పి పడిపోయాడు. దాడిలో పెద్దయ్య రెండు చేతులు విరిగిపోగా, తలకు బలమైన గాయం అయ్యింది. టీడీపీ అధికారంలోకి రావడంతో గ్రామంలోని కొందరు నాయకుల ప్రోద్బలంతో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అటుగా వెళ్తున్న వారు గుర్తించి వెంటనే ఊర్లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో పెద్దయ్య చిన్న తమ్ముడు మునిస్వామి తన అన్నను చికిత్స నిమిత్తం ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, సర్పంచ్ దేవేంద్రరెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పెద్దయ్యను పరామర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న టీడీపీ

- మాల సంఘాల జేఏసీ నాయకులు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): ఓటు బ్యాంకు రాజకీయాలతో టీడీపీ, ఎన్‌డీఏ ప్రభుత్వాలు మాల, మాదిగల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని మాల సంఘాల జేఏసీ నేతలు మాల వెంకటేష్, చిటికెల శామ్యూల్, పీ రాజీవ్‌కుమార్ అన్నారు. కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి శుక్రవారం వారు నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కారంచేడు, చుండూరు ఉద్యమాలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలో మాలల ఉద్యమ స్ఫూర్తిని గమనించిన అగ్రవర్ణ రాజకీయ పార్టీలు మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టాయన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలన్నారు. తీర్పుపై అప్పీలుకు వెళ్తామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలు ఈ ఉద్యమంలో కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో నేతలు బటూరి మహేష్, సత్రి నారాయణ, డీ స్వాములు, ఆనందరావు, బంగి నాగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగుల వేతనాల్లో కోత

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని అమలు చేస్తున్న సిబ్బందికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం షాక్ ఇచ్చింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థల ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకు జూలై నెల వేతనాల్లో భారీగా కోత విధించింది. రూ.4000 నుంచి రూ.10 వేల వరకు కోత పడటంతో వారు లబోదిబోమంటున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేస్తుందని అనుకుంటే... ఇలా షాక్ ఇచ్చిందేమిటని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పని చేసే ఒక వ్యక్తి 2007లో ఉద్యోగంలో చేరగా.. అతని కంటే తక్కువ క్యాడర్, తక్కువ సీనియారిటీ ఉన్న వారికి ఎక్కువ వేతనాలు ఉన్నాయి. తనకు తక్కువ వేతనం వస్తోందని, ఈ వ్యత్యాసాన్ని సవరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన కోర్టు అతని వేతనాన్ని పెంచాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రం వివిధ క్యాడర్‌లలో పని చేస్తున్న సిబ్బంది వేతనాలను అడ్డంగా కోసేసింది. గ్రామీణాభివృద్ధి శాఖకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశంతోనే కోర్టుకు వెళ్లిన వ్యక్తి వేతనం పెంచకుండా సామూహికంగా వేతనాల్లో కోత విధించడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ ఇంజినీర్లు, ఏపీవోలు, టీఏలు వెయ్యి మంది వేతనాల్లో కోత పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాధితులు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. వేతనాల్లో అడ్డంగా కోత విధించడంతో 'ఉపాధి' ఉద్యోగులు ఆందోళన బాట పట్టనున్నారు.

4న జెడ్పీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

- అదే రోజుల ఫలితాల వెల్లడి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలను ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు పరిషత్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సీ రాంగోపాల్, కే రామచంద్రమూర్తి తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా పసుపుల పంచాయతీ సెక్రటరీ హేమంత్‌కుమార్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు. ప్రెసిడెంట్, అసోసియేట్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు నామినేషన్ల అందజేత, స్వీకరణ, 12 నుంచి 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 3 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామన్నారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, పోలింగ్ పూర్తి అయిన అనంతరం కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. పరిషత్ యూనిట్‌లో మొత్తం 114 మంది ఓటర్లు ఉన్నారని, వీరంతా ఉదయం 10 గంటలకు జెడ్పీ ఆవరణలోని అతిథి గృహానికి చేరుకొని ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపి చిన్నమొత్తం పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయంటూ నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామాజిక మాధ్యమాలైన టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా వచ్చే లింకులను నమ్మి డబ్బులు పెట్టుబడి పెడితే సైబర్ నేరగాళ్ల వలలో పడే ప్రమాదముందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు రకరకాల ఇన్వెస్ట్‌మెంట్ నకిలీ లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. లింకులను వివిధ లెవెల్స్‌తో ఉంచి మొదట రూ.100 పెట్టుబడి పెడితే రూ.120 లాభం వస్తుందని భ్రమింపజేసి ఇంకా ఎక్కువ డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేస్తారని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టిన డబ్బులు వందల్లో ఉన్నప్పుడు రిటర్న్స్ వస్తాయని, ఎక్కువ డబ్బును ఆర్జించడం కోసం లింకును వివిధ లెవెల్స్‌ను కంప్లీట్ చేసిన తర్వాత వస్తాయని నమ్మించి మోసం చేస్తారని పేర్కొన్నారు. ఇలా పలు లెవెల్స్‌లో డబ్బు పెట్టుబడి పెట్టినప్పటికీ ఆ లెవెల్‌లో టాస్కులను పూర్తి చేసినప్పటికీ డబ్బులు డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా మోసం చేస్తారని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఎవరైనా మోసపోయి ఉంటే దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో లేదంటే సైబర్ మిత్ర నంబర్ 91212 11100 లేదా 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

రౌడీషీటర్ దారుణహత్య

- పొలాల్లో మద్యం సేవిస్తుండగా వెంటాడి కత్తులతో నరికి హత్య
- మృతుడు గతంలో కానిస్టేబుల్ హత్య కేసులో ప్రధాన నిందితుడు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణానికి చెందిన కల్లూరి సాయికుమార్ అలియాస్ కవ్వ (37)ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా కత్తులతో నరికి చంపేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పీడీయాక్ట్ కింద కడప జైలుకు తరలించగా సాయికుమార్ నాలుగు నెలల క్రితం విడుదలయ్యాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో ఉంటూ కొన్ని రోజుల క్రితం నంద్యాల పట్టణానికి వచ్చాడు. శుక్రవారం కొందరు స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు అయ్యలూరు మెట్ట సమీపంలోని జాతీయరహదారి పక్కన ఉన్న పొలాల్లో చెట్టు వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం అందరూ కలిసి మద్యం సేవిస్తుండగా గుర్తుతెలియని కొంత మంది దుండగులు అక్కడికి కత్తులతో వెళ్లారు. వారిని చూసి సాయికుమార్ స్నేహితులు పరారు కాగా సాయికుమార్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో దుండగులు కత్తులతో వెంట పడి అతని తలపై విచక్షణా రహితంగా నరికి హత్య చేశారు. ఈ దాడిలో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్య చేసిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే వారిని పట్టుకుని హత్యగల కారణాలను తెలుపుతామని డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.


తండ్రి ఎన్ కౌంటర్.. కొడుకు హత్య

రౌడీషీటర్ సాయికుమార్ తండ్రి పేరు వెంకటేశ్వర్లు. ఆయనను నంద్యాలలో మర్డర్ల వెంకటేశ్వర్లు అని పిలిచేవారు. గత 30 ఏళ్లకు ముందు కిరాయి హంతకుడిగా ఉంటూ ప్రజలను భయాందోళనకు గురి చేసేవాడు. పట్టణంలోని ప్రథమ నంది దేవాలయం సమీపంలో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. సాయికుమార్ కూడా తండ్రి బాటలో చెడు స్నేహాలతో పలు నేరాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గత ఎస్పీ రఘువీర్‌రెడ్డి సాయికుమార్‌పై పీడీయాక్ట్ నమోదు చేసి కడప జైలుకు తరలించాడు.

రెండేళ్ల క్రితం ఇదే నెలలో కానిస్టేబుల్ హత్య....

2022 ఆగష్టు 8వ తేదీ రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో కానిస్టేబుల్ సురేంద్రనాథ్ డీఎస్పీ కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. అదే రోజు రాత్రి సురేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల క్షేత్రానికి దర్శనం కోసం వెళ్లేందుకు ఒక బ్యాగ్‌ను కుట్టించేందుకు పద్మావతినగర్ సమీపంలోని దుకాణంలోకి వెళ్లాడు. బ్యాగ్ తీసుకుని బయటికి వస్తుండగా పక్కనే ఉన్న ట్యాటూ దుకాణంలో రౌడీషీటర్ సాయికుమార్ తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ గట్టిగా కేకలు వేస్తుండటంతో సురేంద్ర వారి వద్దకు వెళ్లి కేకలు వేయవద్దని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన సాయికుమార్ స్నేహితులు బీరు సీసాతో సురేంద్ర తలపై దాడిచేశాడు. సురేంద్ర భయంతో పరుగులు తీయటంతో సాయికుమార్ తన స్నేహితులతో కలిసి వెంటాడి పట్టుకుని ఒక ఆటోలో పట్టణ శివారుకు తీసుకెళ్లి కత్తులతో పొడిచాడు. కొన ఊపిరితో ఉండగా ప్రభుత్వాసుపత్రి వద్ద వదిలి వెళ్లిపోయాడు. చికిత్స పొందుతూ సురేంద్రనాథ్ మృతిచెందాడు. సురేంద్రనాథ్‌ను రెండేళ్ల క్రితం ఇదే నెలలో హత్య చేసిన సాయికుమార్ కూడా దుండగులు ఇదే నెలలో హత్య చేయటం సంచలనంగా మారింది.

కృష్ణమ్మ పరవళ్లు



శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణా జలాలు

శ్రీశైలంప్రాజెక్ట్: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. కృష్ణాబేసిన్‌లో వరద ప్రవాహంతో అన్ని ప్రాజెక్ట్‌లు నిండుతున్నాయి. కృష్ణానదీ జలాలు శ్రీశైలానికి ఉధృతంగా చేరుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న వరద ప్రవాహంతో శ్రీశైలంలో నీటిమట్టం గరిష్ఠ స్థాయి 885 అడుగులకు చేరువగా ఉండడంతో, శ్రీశైలంలో 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 20 అడుగులకు తెరచి శుక్రవారం 4,67,280 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 5,07,191 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు కుడిగట్టు కేంద్రంలో 14.159 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.732 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 206.0996 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 883.30 అడుగులకు చేరుకుంది.